కథానిక

# కాకిగూటిలో కోయిల?

పి. సత్యవతి

ఒక్కమాటు ప్రపంచం తల్లకిందులైందా?—అనిపించింది ఆ వుత్తరం చదివాక. అప్పుడే ప్రక్కయింటి గోడ గడియారం పన్నెండు గంటలూ టంగుటంగుమని కొట్టింది. ఏమిటిది—ఇంత ఘోరం జరిగింది! తను నమ్మతాడా? నమ్మకండా ఎలావుండడం? కళ్ళకి ఎదురుగుండా కనిపించుతూన్నది ఎలా నమ్మకండా వుండగలడు? పది సంవత్సరాల కాపరం ఈ వుత్తరంతో తారుమారు అవుతుందా?—అని పెద్ద నిట్టూర్పు విడిచాడు.

నిద్రపోతున్న శారదను చంపేద్దామన్నంత కోపం వచ్చి దగ్గరకు వెళ్ళాడు. మూడు నెలల పసిపాపను దగ్గరపెట్టుకు ఎడపిల్లవాడు రఘును వెనకాతల పడుపెట్టుకుని అమాయికంగా నిద్రపోతూన్న శారదనుచూసి "ఆలోచించు" అని అంతరాత్మ బోధించింది. చిన్న మూలుగుతో వెనక్కి తగ్గాడు.

తిన్నగా పడక కుర్చీలో చారగిలపడి మళ్ళా వుత్తరాన్ని చదివి పళ్ళు పటాపటా కొరికాడు. ఏమిటి చెయ్యటం? అంతా నిజం ఆడవాళ్ళను ఎవరు నమ్మతారు—ఆ—మగవాళ్ళను మాత్రం—నమ్మకం చెడకండా వుండాలే కాని—ఎవరు రాస్తారు?

ఇంకోసారి మూడోమాటుతీసి పైకి స్వచ్ఛంగా చదువుదాం అని తీశాడు.

"డియర్! మిమ్మల్ని కలుసుకున్నప్పుడు మాట్లాడుదామని చాలారోజులనుండి అనుకుంటూండగా మీరు భగవత్కృపవల్ల తటస్థపడ్డారు. మీరు వీలైనప్పుడు నా గదికి వస్తారని అనుకుని రాస్తున్నాను. తప్పకుండా ఈ దీనుణ్ణి నమ్మతారని అనుకుంటున్నాను. నేను మీకోసం ఆదివారాలు మధ్యాహ్నం ఎదురుచూస్తూవుంటాను. మరల మీదర్శనం కోసం ఎదురుచూస్తున్న మీ—స్నేహితుడు."

ఒక్క నిట్టూర్పు విడిచాడు. మొగవాడు రాసిన దస్తూరీ-ఎవరు, వెధవ? ఎవరయితే ఏం? నెమ్మదిమీద ఆచూకీ తియ్యాలే కాని, తొందర పడకూడదు.

అనుకుని పక్కమీద వాలాడు. ఈ పదిసంవత్సరాల కాపరంలో శారద తనను ఎంతగా ప్రేమించిందీ!—జీవిత లో ఆ స్వర్గ సుఖాలు ఎలామర్చిపోతాడు! డబ్బులేక ఉద్యోగంపోయినా ఇబ్బందులు పడుతునా, శారదను పుట్టింటికి వెళ్ళి "నువ్వయినా సుఖపడు!" అన్నప్పుడు, "మీరులేని సుఖం నాకు ఎక్కడిదీ? నేను సుఖపడదామంటే ఒక్కచోటే ఉంది. అక్కడే ఉండి సుఖపడతాను" అని తనమీదవాలి, "ఇక్కడేనాకుసుఖం! ఎప్పుడూ నేను కష్టపడుతున్నానని అనుకోకండి. తిన్నా తినకపోయినా నేనుమిమ్మల్ని వదలివెళ్లను" అని ఎన్నోసార్లు తనకు ప్రమాణంగా చెప్పింది.

ఎప్పుడూ ఒక తప్పుచేసి ఎరుగదు, ఒక మాట పలికి ఎరుగదు. తనకు కోపంవస్తే?—అంత పని చెయ్యగా లేనిది దెబ్బలు తినలేదూ?

పిల్లలు ఏమయిపోతారు? — ఆలోచిస్తూనే ఇంచుమించు తెల్లవారుతుండగా మాగన్నుగా నిద్రపోయాడు.

* * *

"ఏమండీ!"

"ఊఁ"

"ఎనిమిదిన్నరకూడా అవుతోంది. లేవరూ?" అంటూ మొహంలో మొహం పెట్టి, నెమ్మదిగా లేపటంవల్ల మెళకువవచ్చి లేచాడు. లేచి కాలకృత్యాలు ముగించుకుని "వడ్డించు!" అన్నాడు. తొమ్మిది గంట లవటంచేత చాలా ముభావంగా పలాయనమంత్రం పఠించడానికి సిద్ధమవుతూ ఉండటం చూసి పిల్ల "నాన్నా! నాకు రిబ్బన్లు తెస్తావు కదూ రాత్రి" అని కేకవేస్తూ మెట్లదాకా పరిగెత్తుకొచ్చి పడింది. శారదవచ్చి పిల్లను సముదాయించి లోపలికి తీసుకెళ్ళింది.

* * *

ఎన్నాళ్లు-లోపలే సముద్ర మథనం- ఈ బాధ

ఎవరితో చెప్పేది కూడా కాదు.

శారద మొహం ఎప్పటిలానే ఉంది. మామూలుగా నిత్యకృత్యాలు ముగించుకుని ప్రేమగా తన దగ్గరికి రావడం తను ఏదో వంకతో విసుక్కోవడం రోజూ జరుగుతోంది. ఏమిటి చెయ్యడం! దారిలేదు. నమ్మకంగా పుట్టింటికి పంపి యీమావ జీవం మళ్ళా తీసుకురాకుండా ఉంటే?-కాదు. భయం-ఏమిటి? అసలు సంగతి చెప్పి "నువ్వు నాకు వద్దు. నీ యిష్టంవచ్చిన చోటికే వెళ్లు" అంటే?

బాబోయ్! నలుగురు పిల్లలే! వీళ్లంతా ఏమవుతారు? అమ్మో! తలుచుకుంటే గుండెలు బద్దలవుతున్నాయి. తను వట్టి పిరికివాడు అయిపోతున్నాడా—అనిపించింది.

"నాకేం భయం! బాహాటంగా అడుగుతాను. అడిగితే ఒప్పుకుంటుందా? ఏదోచేసేది చెయ్యాలి. కాస్త, నిమ్మళంగా ఆలోచించాలి తొందరపడి లాభంలేదు. నామూలాన్ని ఐదుప్రాణాలు సంక్షోభిస్తాయి"అనుకున్నప్పుడల్లా గుండె బరువు అవుతోంది. మళ్లీ జాలిపడ్డాడు. "శారదా!" అని తనకు తెలియకుండానే పిలిచాడు. "అప్పుడే నిద్రపోతున్నావా!" అంటూ లేచాడు కుర్చీ లోంచి "ఎందుకూ నామీద కోపం మీకు?"అని అడిగేసరికల్లా, "పిచ్చిపిల్లా! కోపం లేదు!" అన్నాడు.

ఎన్నివిధాల శాంతపర్చుకుందామన్నా మనస్సు కుదుటపడ్డంలేదు. ఇక వారం సెలవు అయినా పెట్టి ఈసంగతి కనుక్కోవాలి. ఊరుకుంటే ఊరుక్కోవడమే అవుతోంది.

మామూలుగా నిత్యకృత్యాలు జరిగిపోతున్నాయి. అప్పుడే ఓ నెల కావచ్చింది. తను చాలా నెమ్మదిగా ప్రవర్తించాలి. వెధవ జాలిమనస్సు—ఏడుస్తుందేమో?

ఓవారం సెలవు తీసుకొన్నాడు, ఆఖరికి కిందా మీదాపడి ఏదో అడిగి తేల్చుకుందామని. పోనీ తను వూరెళ్ళినట్టుగా మారువేషంతో తనింటి చుట్టూ తిరుగుతూంటే? అచ్చే లాభంలేదు. అడగాలిసిందే భయం ఏమిటి పిరికి వెధవలా? అప్పుడే రెండురోజులుకూడా అయింది సెలవు. మధ్యాహ్నన్నం ఒంటిగంట అవుతుంది. తను పాత చిత్తూ కాగితాలన్నీ చూసుకుంటూ ముందు గదిలో కూచున్నాడు. శారద అక్కడే చాప మీద పిల్లను పక్కలో పెట్టుకుని పడుకుని నిద్ర పోతోంది, ఎడపిల్లవాడు ఆడిఆడి మేడమెట్ల గదిలో అక్కడే నిద్రపోయాడు. కాఫీ తాగుదామని బుద్ధి వేసింది. లేపుదాం అనుకుంటుండగా కింద చప్పుడు, తలుపు ఎవరో కొడుతున్నట్లు వెళ్ళి తలుపుతీశాడు.

"అన్నపూర్ణగారా, రండి! ఎవరో అనుకున్నాను" అంటూ తను పక్కకు జరిగి చోటు యిచ్చాడు. శారదకూడా వాళ్ళ పిల్లలూ ఆవిడా రావడం చప్పుడు విని లేచింది.

"ఎప్పుడు రావడం వూరినుంచి?" అంటూ చాప వేసింది.

"నిన్న మెయిలుకి వచ్చామండీ! ఆయన ఇవాళే ఆఫీసుకి వెళ్ళారు. నిన్న వద్దామంటే ప్రయాణపు బడలికచేత కదల్లేకపోయాను."

"మీవాళ్ళంతా కులాసాగా ఉన్నారా? పండగ సరదాగా గడిచిందా? అన్నట్టు మీ చెల్లెలికి సంబంధం వచ్చిందని రాశారు కుదిరిందా?" అని ప్రశ్నలవర్షం కురిపించింది శారద.

"సంబంధాలకేముందీ? రెండు మూడు వున్నాయి. కట్నం తక్కువ ఉంటే చదువూ ఆస్తీ సున్నా. రెండూ వుంటే కట్నాలు లేక పోయినా చిక్కే. ఏదోఘటన ఉండాలికదా? ఎప్పుడో—"

"ఏమిటోనమ్మా, రోజులు! చదువుకున్న పిల్లలికీ కట్నాలు అడుగుతున్నారు! డబ్బు లేకపోయినా దాంపత్యం ముచ్చటగా ఉండాలి ఈడు జోడుగా— ఆ పిల్లకు మాత్రం అనాకారి మొగుడిని కట్టకండి."అంది శారద.

వాళ్ళ మాటలతో యిరవైఏళ్ళనాడు, తనూ శారదా పెళ్ళి పీటలమీదనుంచి లేచి నాయనమ్మకు దణ్ణం పెట్టడానికి వెడితే, "నాయనా! నీకుతగ్గ పెళ్ళాన్ని చేసుకున్నావురా. మావాడికి ఏ నల్లపిల్ల వస్తుందో అని బెంగెట్టుకున్నాను. చిలకా గోరింకలాగా వెయ్యేళ్ళూ ఆయురారోగ్య సుఖాలతో బతకండి నాయనా!" అని దీవించింది.

ఇంతకీ ఆ వృద్ధురాలి దీవన ఎల్లా ఫలిస్తుందో! ఇలా ఎంత దూరమో వెళ్లింది.

"కాఫీ ఏమయినా పెడతావా?" అంటూ తను కేక వేశాడు.

"రండీ వంటింట్లోకి వెడదాం!" అంటూ శారదా అన్నపూర్ణా వంటగదిలోకి వెళ్ళారు. పిల్లలూ, ఆవిడా కూడా వచ్చారు. "ఉత్త కాఫీయేనా!" అనుకుంటూ రెండు రూపాయలకాగితం జేబులో వేసుకుని, "ఇప్పుడే వస్తా; తలుపేసుకో" అని బయటకెళ్ళాడు.

"అరే! కాఫీ పెడుతూంటేగా వెడతారేం?" అన్న కేక ఆవిడవెయ్యడం మాత్రం వినిపించింది.

* * *

అంతా ఫలహారం చేసి కాఫీ తాగి వాళ్లు సావిట్లోకి, నేను నా గదిలోకి వచ్చాం. సిగరెట్టు తీసి వెలిగించాను. ప్రశాంతంగా కిటికీలోంచిగాలి వస్తోంటే ఏదో హాయిగా సిగరెట్టు పీలుస్తున్నా-వాళ్ళ కబుర్లు వింటూ. అవతల సావిట్లో ఆడవాళ్ళూ చీరలు కొత్తగా కొన్నవి, పక్క ఇంటావిడ నెలతప్పిందనుకుని పడ్డవేవిళ్ళూ-ఒకటేమిటి. మొగవాళ్లకు కొంతసేపు మాట్లాడుకుంటే సంగతులు అయిపోతాయి. ఆడవాళ్లు ఎన్ని రోజులో చెప్పుకుంటారు అవి ఎక్కడనుంచి వస్తాయో! అవి తరగవు. అలా గంట రెండు గంటలు చెప్పుకున్నారు—నాకు మనస్సు బాగాలేదు. వింటే అయినా మనస్సు హాయిగా ఉంటుందని అలాగే పడుకున్నా వాలుకుర్చీలో. "అదిగో బడిపిల్లలు కూడా వచ్చారు. పొద్దుపోయింది. నేనువెడతా" అని అన్నపూర్ణగారు బయలుదేరారు.

"అన్నట్టు మరిచిపోయాను. మొన్న తెచ్చిన పుస్తకాలు చదివారా?" అని ఆవిడ అడిగింది. మళ్ళీ కావలిస్తే ఇంకోమారు తెచ్చుకుందురు గాని ఒకమారు అవి ఇస్తారా? మావికావు కాదూ!"

"ఏమోనండీ నాకు చదవటానికి ఎక్కడ తీరుబడీ? ఈ పిల్లలూ, వంటతో సవరింపులతోనే సరి—ఆసక్తికొద్దీ చదువుదాం అని తెస్తా, ఏదో మొదలెట్టాను ఓ రోజూ—మా పిల్లలు ఇంతట్లో కొట్టుకున్నారు. పట్టుకెళ్లండి. చదవను" అని విసుగ్గా అంది. నేనూ నా పిల్లలు అంత విసుగ్గా వున్నారు కాబోలు దానికి! శారద ఏవో పుస్తకాలు గదిలోకివచ్చి తీసుకెళ్లటంమాత్రంచూశాను. అవి తీసుకెళ్ళి మా శారద ఆవిడకు ఇవ్వటం ఇంతలో ఈ మాటలు నాకు వినబడ్డాయి.

"ఎంత వెతుకున్నారండీ ఈ కాగితాలకోసం అబ్బ నా ప్రాణం తీస్తారు. ఎక్కడ ఏ కాగితం మీద పడితే ఆ కాగితం మీద రాసి, ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తారు. ఏదో నవల రాస్తున్నారు ఆయన. అందులో నాయకుడు నాయికకి రాస్తాడు ఈ వుత్తరం—దీనికోసం నా ప్రాణం తీస్తున్నారు కనపడ లేదని! అన్నీ తలోచోటా పడేస్తే నేను సర్దాలండీ"అంది-అన్నపూర్ణగారు.

నాకు ఆ మాటలు పాకు కొట్టినట్టుగా వినబడ్డాయి. నాలో పెద్ద తుపాను వెలిసినట్టుగా తేలికపడి, నాశరీరం గాలిపడిగలా ఆడిపోయింది. ఒకే పెద్ద కేకవేశాను. "శారూ!"అని.

ఆవిడ వెళ్లే ప్రయత్నంలో వున్నారు కాబట్టి శారూ రాలేదు. అడిగానుకాదు. ఫూల్-అవటం కాకండా—

నానాగొడవ చేసేదేమో! బడినుండి పిల్లలూ రావడంవల్లా వాళ్ళకు కాఫీ అదీయిచ్చి పనిదాన్ని "ఇల్లు తుడవాలి తొరగా కానీ!" అని అధికారం చేస్తూ మందగమనంతో "ఎందుకూ పిలిచారూ?" అంటూ వచ్చింది.

నేను ఏమీ మాట్లాడలేకపోయినాను—

"పిల్లలు కొట్టుకుంటారని టిఫిన్ వాళ్ళకు సర్ది పెట్టి వచ్చా—అసలే కోపంగా వున్నారు, కోపం వచ్చిందా?" అంటూ అక్కడ పుస్తకాలు సర్దటం మొదలు పెట్టింది.

"నాఅంత నీచుడులేడు శారూ!" అంటూ కుర్చీలోంచి లేచి మంచంమీద కూచోపెట్టి జరిగిన సంగతి అంతా చెప్పాను, వెధవ మోహం వేసి!

"బలేవారు ఎంతబాధ పడ్డారండీ—"అంటూ బుగ్గమీద ఓ చిన్న చిటిక వేసిందేకాని నా శారూకి కోపంరాలేదు.

"నన్ను క్షమించవూ శారదా!" అన్నాను.

"ఏమిటీ క్ష మి ం చా లీ తగినశిక్ష వేస్తా వుండండీ!" అంటూ దగ్గరగా వచ్చింది. ఇంతలో వంటయింట్లో యుద్ధకాండ జరిగే సందడివింటూ-

"పిల్లలు కోతిగంతులు వేస్తారు. వాళ్ళకు ఏం తెలుసూ పెద్దవాళ్లుపడే ఆందోళనలు సుఖదుఃఖాలు జీవితంలో?"

అమ్మాఅంటూ అంతా గదిలోకి వచ్చారు.

"సినిమాకు వెడదాం శారూ! తొందరగా కానీ" అన్నాను.